జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



శనివారం | 20-07-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 77 పేజీలు: 8 వెల : రూ.7


# సిక్కోలులో.. భారీ వర్షం



* జిల్లా వ్యాప్తంగా వర్షాలు * నదుల్లోకి వరద నీరు
* శ్రీకాకుళంలో 84.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు * నేడు పాఠశాలలకు సెలవు
* అధికారులు అప్రమత్తం: కలెక్టర్

**శ్రీకాకుళం, జులై 19 (వార్త):** బంగాళాఖాతంలో తుఫాన్ కారణంగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో నదుల్లోకి వరదనీరు వచ్చింది. జిల్లా కేంద్రంలో 84.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. చెరువులు, పంట పొలాలు నీటితో కళకళలాడుతోంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు రహదారుల్లోని గోతుల్లోకి నీరు చేరడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. తుఫాన్ తీరం దాటే సమయంలో గాలులతో కూడిన వర్షం కురియనందున జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థలకు శనివారం సెలవు ప్రకటిస్తున్నట్టు డీఈవో ఆదేశాలు జారీ చేశారు.

## లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

తుఫాన్ కేంద్రాలను అధికారులు సంయుక్తంగా సందర్శించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లాలో తుఫాను ప్రభావిత ప్రాంతాల ముందస్తు చర్యలు, శానిటేషన్, తదితర అంశాలపై ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తో కలిసి మండలాల్లోని తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఈఓపిఆర్డీలుతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఉన్న కాలువలు, బ్యారేజీలను రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ అధికారులు కలసి జాయింట్ ఇన్స్పెక్షన్ చేయాలని ఆయన ఆదేశించారు. జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, లారీ ప్రమాదానికి గురైనట్లు ఆయన గుర్తు చేశారు. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సిబ్బందికి సెలవులు రద్దు చేయాలని చెప్పారు. నదులు, కాలువలు, చెరువుల గట్లు ఎక్కడైనా పాడైతే తక్షణమే మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వంశధార ఎస్ఈ రాంబాబు మాట్లాడుతూ వంశధారలోకి 1900 క్యూసెక్కుల నీరు వచ్చిందని తెలిపారు. జిల్లా ఎస్పీ కె. వి. మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బోట్లు ఎక్కడైతే ఉన్నాయో అవి కండీషన్‌లో ఉన్నాయో లేదో చూడమని సంబంధిత పోలీసులకు తెలియజేస్తామన్నారు. ఫోన్లు పనిచేయకపోతే మేన్ ప్యాక్ లు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. వ్యవసాయ శాఖ పై జెడి శ్రీధర్ మాట్లాడుతూ ప్రస్తుతం వరకు కురిసే వర్షాలకు రైతులు సంతోషంగా ఉన్నట్లు చెప్పారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న నీరు కాలువలకు నీరు వెళ్లే విధంగా చూడాలని ఇరిగేషన్ అధికారులకు తెలిపినట్లు చెప్పారు. నారు మళ్ళు ముంపుకు గురైతే కుళ్లిపోతే విత్తనాలు సిద్ధంగా ఉంచినట్లు వివరించారు. ఈ వర్షాలు రైతులకు బాగా ఉపయోగపడతాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు, జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం ఆర్డీఓ సిహెచ్. రంగయ్య, డిపిఓ వెంకటేశ్వరరావు, సిపిఓ లక్ష్మీ ప్రసన్న, ఐసీడీఎస్ పీడీ బి. శాంతి శ్రీ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్, డిటిసి చంద్ర శేఖర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. మీనాక్షి, వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్, డిటిసి, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కళింగపట్నం పోర్టుకు మూడో నంబరు ప్రమాద హెచ్చరిక

**గార:** బంగాళఖాతంలో అల్పపీడనం తుఫాన్‌గా మారిన దృష్ట్యా కళింగపట్నం పోర్టులో మూడో నంబరు ప్రమాద హెచ్చరికను సంబంధిత అధికారులు జారీ చేశారు. మరో రెండు మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించింది. కళింగపట్నం తీరంలో ఉధృతంగా అలలు ఎగసిపడుతున్నాయి.

## వంశధారకు వరద


**హిరమండలం:** వంశధార నదికి వరదొచ్చింది. నది పరివాహాక ప్రాంతాల్లో పడుతున్న వర్షాలకు వంశధార నదిలో నటి ప్రవాహం పెరిగింది. శుక్రవారం గొట్టాబ్యారేజికు సంబంధించిన రెండు గేట్లను 20 సెంటీమీటర్లను, మరో గేట్‌ను 10 సెంటీమీటర్ల ఎత్తులో ఎత్తి దిగువకు 3,353 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. నదిలోకి 3,353 క్యూసెక్కుల నీరు చేరుతుందని, గొట్టాబ్యారేజికి అనుసంధానమైన కుడి ప్రధాన కాలువ ద్వారా 440 క్యూసెక్కులు, ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1108క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈఈ తెలిపారు.





# మీ నమ్మకాన్ని నిలబెడతాం

* నాయకులు అంటే అచ్చెన్న, రాములా ఉండాలనేలా ఉంటాం * కింజరాపు బ్రాండ్‌ను ప్రజలు తలచుకునేలా వ్యవహరిస్తాం * జిల్లా అభివృద్ధికి కంకణం కట్టుకున్నాం * కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్, అచ్చెన్నాయుడు
* టెక్కలిలో మంత్రులకు ఘన స్వాగతం



**టెక్కలి, జులై 19(వార్త):** ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతాం.. నాయకులు అంటే అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడులా ఉండాలనేలా ఆదర్శంగా ఉంటాం.. కింజరాపు బ్రాండ్ పేరు ప్రజలు తలచుకునేలా చేస్తాం.. అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం టెక్కలి మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌర సన్మాన కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులు పాల్గొన్నారు. వారికి పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించాయి. అంతకుముందు టెక్కలిలో బాబాయ్, అబ్బాయ్‌లకు పెద్ద ఎత్తున ఊరేగించారు. ఎక్కడికక్కడ గజమాలలు వేశారు. టెక్కలి పసుపుమయమైంది. అనంతరం ఏర్పాటు చేసిన సభలో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వంపై నమ్మకంతో 164 సీట్లతో గెలిపించిన ప్రజలకు, కార్యకర్తలకు రుణపడి ఉంటా మన్నారు. మీరిచ్చిన నమ్మకాన్ని వమ్ము చేయమన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతన్నలకు సాగునీరు ఆటంకాలు లేకుండా వంశ ధార కాలువలులో పనులు నిర్వహించి శివారు ప్రాంతాలకు సాగునీరు అందేలా చేశామన్నారు. రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ తాను పౌరవిమానయాన శాఖ మంత్రి అయిన తర్వాత భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు వేగవంతమయ్యా యన్నారు. మూలపేటలో మినీ ఎయిర్‌పోర్టును నిర్మిస్తామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నుండి వలసలు వెళ్లేలా కాదు.. శ్రీకాకుళం జిల్లాకే వలసలు వచ్చే విధంగా తీర్చిదిద్దు తామన్నారు. సిక్కోలు అంటే యువతకు ఉపాధి అవకాశాలు అని చెప్పుకునే విధంగా అభివృద్ధి చేసి చూపిస్తామని, మనది డబుల్ ఇంజన్ ప్రభుత్వమని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కింజరాపు హరిప్రసాద్, బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, బోయిన రమేష్, జీరు భీమారావు, కణితి కిరణ్‌కుమార్, అట్టాడ రవిబాబ్జీ, బిర్లంగి ఉమామహేశ్వరరావు, పి.తిరుపతి రావు, బోయిన గోవిందరాజులు, చౌదరి బాబ్జి, ఎల్ఎల్ నాయుడు, పద్మావతి, దమయంతి, సుందరమ్మ, లవకుమార్, కామేసు, మామిడి రాము, కింగ్, దోని బుజ్జి, దల్లి ప్రసాద్‌రెడ్డి, మల్లిపెద్ది మధు, ప్రీతీష్, తదితరులు పాల్గొన్నారు.


బాబాయ్, అబ్బాయ్‌లకు అపూర్వ స్వాగతం ..5లో


## అవయవదాత శ్రీనివాస్‌కు..
# ఘన నివాళి




**సంతబొమ్మాళి, జులై 19 (వార్త):** మిత్రమా.. నీకు మరణం లేదు.. భౌతికంగా నీవు లేకపోయినా.. నీ అవయవాలు ఇతరులకు ప్రాణం పోసింది.. వారిలో నువ్వు మాకు కనిపిస్తున్నావు.. అంటూ చల్ల శ్రీనివాసరావు స్నేహితులు, కుటుంబీకులు కంట ఆనంద భాష్పాలు రాల్చారు. వివరాల్లోకి వెళితే.. గోవిందపురం పంచాయతీ జొన్నలపాడుకు చెందిన చల్ల శ్రీనివాసరావు ఈనెల 14న కారులో వెళు తుండగా లారీ ఢీకొంది. దీంతో శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. వారం రోజులుగా కోమాలో ఉన్న శ్రీనివాసరావు బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు అతని కుటుంబీకులకు తెలిపారు. అతని అవయవాలు దానం చేయాలని సూచించారు. దీనికి శ్రీనివాసరావు తల్లిదండ్రులు అప్పమ్మ, మల్లేషులు అంగీకరించారు. దీంతో శుక్రవారం శ్రీనివాసరావు లివర్, హార్ట్‌తో ఇతర అవయవాలను తొలగించారు. ఆ తర్వాత శ్రీనివాసరావు మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. జెమ్స్ వైద్యులు, సిబ్బంది శ్రీనివాసరావు భౌతికదేహంపై పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు. శ్రీనివాసరావు అంత్యక్రియలు శుక్రవారం గోవిందపురం గ్రామంలో జరిగాయి. ఈ అంత్యక్రియల్లో సర్పంచ్‌లు రెడ్డి అప్పన్న, గూట్ల మల్లేశ్వరరరావులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## నోట్‌పుస్తకాల పంపిణీ

**జలుమూరు, జులై19 (వార్త):** జలుమూరు కోన పెంటమ్మ-రామ్మూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు నోట్ పుస్తకాలను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పంపిణీ చేశార. కార్యక్రమంలో టీడీపీ జలుమూరు మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్ర నాయుడు, శిమ్మ చంద్రశేఖర్, మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భైరి భాస్కరరావు, మునుకోటి దాంబాబు, బగ్గు గోవిందరావు, పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగ స్వామి బాబు, అక్కాజోస్యల ఉమా దత్తు బాబు, జుత్తు అప్పలనాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పని చేస్తారా.. తప్పుకుంటారా!

*** జిల్లాను సస్యశ్యామలం చేయడమే మా లక్ష్యం * మున్సిపాలిటీకి 24 గంటలు తాగు నీరు ఇచ్చేలా చర్యలు చేపట్టండి * అధికారులకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వార్నింగ్**

**ఇచ్ఛాపురం, జులై 19(వార్త):** గత ప్రభుత్వం మాదిరిగా నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దు.. పనిచేసే అధికారులు అంటే మాకు గౌరవం ఉంది.. పని చేయని వారిపై చర్యలు తప్పవు.. పనులు తప్పించు కోవడానికి సాకులు చెప్పొద్దు.. మాతో కలిసి పని చేస్తే కొనసాగండి లేకుంటే గౌరవంగా పక్కకు తప్పు కోండి.. అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అధికారులకు తన దైన శైలిలో సుతిమెత్తగా హెచ్చరికలు జారీ చేశారు. శుక్రవారం ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో నియోజకవర్గ స్థాయిలో కౌన్సిల్ హాల్ ఆవరణలో





ఇరిగేషన్, ఆర్డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, ఉద్దానం ప్రాజెక్ట్, జల్ జీవన్ మిషన్ శాఖలకు సంబంధించిన పలు అంశాలపై జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రిగా బాధ్య తలు స్వీకరించాక తొలిసారిగా ఇచ్ఛాపురంలో పర్య టించిన ఆయనకు ఘన స్వాగతం పలికారు, కొర్లం జంక్షన్ వద్ద స్వాగతం పలికి జాతీయ రహదారిపై ఏఎస్‌పేట మీదుగా గ్రామ దేవత స్వేచ్ఛవతి అమ్మ వారి ఆలయం వరకూ ర్యాలీ సాగింది. అమ్మవారిని దర్శనం చేసుకున్న అనంతరం బస్టాండ్‌లో ఎర్ర న్నాయుడు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిం చారు. అనంతరం జరిగిన సమీక్ష సమావేశంలో మున్సిపాలిటీ 23 వార్డులకు 24 గంటలు నీరు అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. పురుషోత్తపురం, ఎస్‌పేట ఒకటి, రెండు, మూడు వార్డులకు తాగునీరు అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రయత్నాలు చేయాలని చెప్పారు. 58 కోట్ల రూపాయల ఏఐబి ప్రాజెక్టుతో రెండేళ్లుగా 10 శాతం కూడా పనులు కాకపోవడంపై పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సుగుణాకర్‌రావును ప్రశ్నించారు. ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులతో కలిసి ఉద్దానం ప్రాజెక్టు అనుసం ధానం ద్వారా నీరు అందించేందుకు సాధ్యా సాధ్యాలను పరిశీలించాలన్నారు. జిల్లాలో 700 కోట్ల రూపాయలతో జలజీవన్ మిషన్ పనులు చేపట్టి కేవలం 209 గ్రామాలకు మాత్రమే నీరు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ప్రాజెక్టు జలజీవన్ మిషన్ తో 800 గ్రామాలకు నీరు అందేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పొంతన లేని సమాధానం చెప్పడంతో ఈఈ జాన్ బెన్హర్‌పై కేంద్ర మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 ఏళ్లుగా




ఉద్దానం ప్రాజెక్టుల పని చేస్తున్న సిబ్బందిని ఎలా తొలగించారని మండిపడ్డారు. మెగా ఇంజనీరింగ్ కాంట్రాక్టర్ సంస్థ పెత్తనంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో వంశధార, నాగావళి, బహుదా నదుల అనుసంధానంతో జిల్లాలో సాగు, తాగునీటి కొరత తీరుతుందన్నారు. సోంపేటలో 100 కోట్ల రూపాయల నిధులతో రూర్బన్ పథకం కోసం కేటాయిస్తే నిధులు పక్కదారి పట్టాయన్నారు. మున్సి పాలిటీ పరిధిలో డైలీ మార్కెట్ అభివృద్ధికి కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్య లక్ష్మి, ఆర్డీవో భరత నాయక్, జనసేన నాయకుడు దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.



# పాడి పశువులలో లంపి స్కిన్ వ్యాధి ప్రమాదకరం

**మందస, జులై 19 (వార్త):** లంపి స్కిన్ వ్యాధి (ముద్ద చర్మవ్యాధి) పశువులు మధ్య వేగంగా వ్యాప్తి చెందే లక్షణం కలిగి ఉండి రైతులకు ఆర్థికంగా నష్టం కలిగించే అతి ముఖ్యమైన వైరల్ వ్యాధి అని మందస, హరిపురం పశువైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమభారతి అన్నారు. మందసలో వారు మాట్లాడుతూ ఈ వ్యాధి ప్రధానంగా ఆవు జాతి పశువులో కనిపిస్తుందని, అన్ని వయసు పశువులకు ఈ వ్యాధి సోకుతుందాన్నారు. ఈ వ్యాధి ముఖ్యంగా వేడి మరియు తేమతో కూడిన వాతావరణం ఉన్న నెలలో, పశువులను ఆశించే కీటకాల ద్వారా ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన పశువులకు తీవ్ర జ్వరముతో బాధపడుతూ, కళ్ళు ముక్కు నుండి స్రావాలు కారుతూ ఉంటాయి. కొన్ని పశువులలో నోటి నుంచి చొంగ కూడా కారుతూ ఉంటుంది. ఈ వ్యాధి



తీవ్రంగా ఉన్న పశువుల్లో శరీరం అంతటా నొప్పితో కూడిన కణతలు/బొడిపెలు ఏర్పడతాయి. చర్మం బిగుదుగా ఉండే ప్రాంతాలైన కాళ్లు, తోక వంటి ప్రదేశాల్లో రెండు మూడు కడతలు కలిసి ఒక పెద్ద పొరవలే చర్మం ఊడిపోయి పెద్ద పెద్ద గాయాలు ఏర్పడి పశువులు తీవ్ర ఇబ్బంది గురవుతాయి. ఈ వ్యాధి సోకిన పాడిపశువుల్లో పాల దిగుబడి గణనీయంగా తగ్గడం తోపాటు కొన్నిసార్లు మరణాలు కూడా సంభవిస్తాయి. ఈ వ్యాధి నివారణకు మండలంలో 12,400 డోసుల లంపి స్కిన్ వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నాయని ఈ నెల 20 నుండి ఆగష్టు 18వ తేదీ వరకు రైతు సేవా కేంద్రాల సిబ్బంది ద్వారా ఈ వ్యాధినిరోధక టీకాలను ఉచితంగా వేయబోతున్నామని తెలియజేసారు. కనుక పాడి రైతులు ఈ ముద్ద చర్మ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండి, వ్యాధి రాకుండా నివారణకు ముందస్తు టీకాలను తమ పశు వులకు సమీప రైతు సేవా కేంద్రాల ద్వారా వేయించుకోవాలని వారు సూచించారు.



## ఉపాధి కూలీ రూ.600లకు పెంచాలి

**పలాస, జులై 19(వార్త):** ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు రోజు కూలి రూ.600లకు పెంచాలని, వర్షాభావ పరిస్థితుల వలన వ్యవసాయ పనులు దొరకటం లేదని, ఉపాధి పని 200 రోజులకు పెంచాలని ఏపీ జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ గణపతి డిమాండ్ చేశారు. పలాస మండలం మాకన్నపల్లి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ సీహెచ్ సోను, కాశీబుగ్గ గాంధీనగర్ సచివాలయం ఎడ్మిన్ లావణ్య కుమార్‌కు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే పెండింగు బిల్లులు చెల్లించాలని కోరారు. గత ఏడాది ఖరీఫ్‌కు సంబంధించిన కరువు, తుఫాన్‌లతో నష్టపోయిన రైతులకు పంటల బీమా పరిహారం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.20వేలు రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తానని హామీ ఇచ్చారని, ఖరీఫ్ సీజన్లో ప్రారంభం కావస్తున్నా ఇచ్చిన హామీను అమలు చేయలేదన్నారు. విద్యుత్ మోటార్లు పెట్టేందుకు తెచ్చిన ప్రభుత్వ జి.ఓ, నెం.22 రద్దుచేయాలన్నారు. వినతి పత్రం అందజేస్తున్న వారిలో రైతులు గార రుద్రయ్య, జుత్తు నరేష్, కిషోర్, బత్తిని తేజ, అప్పలస్వామి, పాతిన త్రినాథ్, జి.ఉమాపతి, పోతనపల్లి సాయి, తెప్పల కార్తీక్, ఎ.వీరాస్వామి, వి.కృష్ణారావు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో మొక్కలు నాటండి



**పలాస, జులై 19(వార్త):** పలాస రైల్వే ఆవరణకు ఆనుకుని ఉన్న అంబుసోలి ఎంపీపీ స్కూల్ వద్ద గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో జామ, ఉసిరికా, చెర్రీ, బాదం కదంబ వివిధ పండ్ల రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రీన్ ఆర్మీ ప్రతినిధులు మాట్లాడుతూ వర్షాలు పడే సమయంలో మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జే.సంతోష్ కుమార్ మాట్లాడుతూ రుతువులు క్రమం తప్పకుండా ఉండాలంటే మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ప్రకృతి ప్రేమికుడు కొత్తపల్లి చిన్నాచారీ మాట్లాడుతూ పాఠశాలకు క్రీడా సామగ్రి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్ సావిత్రి, టి.చినబాబు, గ్రీన్ ఆర్మీ సభ్యులు కూన జనార్ధన, దిలీప్, బందాపు తిరుమల పాల్గొన్నారు.

## ఫార్మసీ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి వినతి

**పలాస, జులై 19 (వార్త):** పలాసలోని కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో ఫార్మసీ ఆఫీసర్స్ పోస్టులు భర్తీ చేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకి ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ ఆఫీసర్స్ సంఘం తరపున స్టేట్ వైస్ ప్రెసి డెంట్ బోనేల గోపాలరావు వినతి పత్రం అందజేశారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి రీసెర్చ్ సెంటర్‌లో పోస్టులు భర్తీకి చర్యలు చేపడతామన్నారు.



## టీడీపీలోకి వైసీపీ కార్యకర్తలు

**నరసన్నపేట, జులై 19 (వార్త):** నరసన్నపేట హడ్కో కాలనీకి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు శుక్రవారం టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీలో చేరిన వారికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పార్టీ కండువా వేసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన వారంతో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని సూచించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఆర్ఎంపీ వైద్యుడు శ్రీనివాస్ మృతి



**పలాస, జులై 19 (వార్త):** ఆర్ఎంపీ వైద్యుడు కుందు శ్రీనివాస్ శుక్రవారం మృతి చెందారు. శ్రీనివాస్ మృతితో కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. శ్రీనివాస్ వజ్రపుకొత్తూరు మండలంలోని చిన్నకొత్తూరు గ్రామ వాస్తవ్యుడు, మాజీ వైస్ ప్రెసిడెంట్. ఆర్ఎంపీగా ప్రజలకు వైద్యసేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందారు. శ్రీనివాస్ మృతికి ఆర్ఎంపి వైద్య సంఘం కూడా సంతాపం వ్యక్తం చేసింది. అలాగే పలాస ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ జగదీష్, ఎన్.అశోక్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు మహరణ, అంది రాము, ఎలక్ట్రాన్ మీడియా అధ్యక్షుడు నేతాజీ, జయంతి మాస్టారు తదితరులు శ్రీనివాస్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## రహదారిలో ప్రమాదకర గుంత

**నరసన్నపేట, జులై 19 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీలోని స్థానిక నేతాజీ వీధి నుంచి ప్రధాన రహదారికి వెళ్లే కూడలి వద్ద గుంత ప్రమాదకరంగా మారింది. వారం రోజుల కింద ఇక్కడ గుంత ఏర్పడినప్పటికీ సంబంధిత అధికారులకు కనిపించకపోవడం శోచనీయం. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు.

## 21న నరసన్నపేటకు కేంద్ర మంత్రి

**నరసన్నపేట, జులై 19 (వార్త):** నరసన్నపేట మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఈ నెల 21న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు రానున్నారని ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. గతంలో ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన వావిలాపల్లి నారాయణస్వామి పదవీ విరమణ చేశారని తెలిపారు. ఆయనకు ఈనెల 21న సన్మానించనున్నారని, ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి పాల్గొంటున్నారని చెప్పారు.

## సొంత నిధులతో కాలువ పనులు



**నరసన్నపేట, జులై 19 (వార్త):** తెలగవలస సమీపంలో వంశధార కాలువలో షట్టర్ల వద్ద మదుమలు శిథిలావస్థకు చేరాయి. వంశధార అధికారులు పట్టించుకోకపోవడంతో ఆయకట్టు రైతులు స్పందించి రైతులు స్వయంగా మరమ్మతులు చేసుకున్నారు. షట్టర్ల వద్ద సొంత నిధులతో కాంక్రీట్ గోడలను నిర్మించుకున్నారు.

## పోలాకి గెడ్డ నుంచి నీరందించండి



**జలుమూరు, జులై19 (వార్త):** పోలాకి గెడ్డ నుంచి పొలాలకు సాగునీరు అందేలా చూడాలని నడగాం గ్రామ రైతులు శుక్రవారం ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తిని కోరారు. గెడ్డ పూడుకుపోయిందని, దీంతో సాగునీరు అందడం లేదని తక్షణం తగు చర్యలు చేపట్టి సాగునీరు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రుక్కు. శ్రీరామమూర్తి, టీడీపీ నాయకులు జానకిరామయ్య, రామరాజు మాస్టారు, మోహనరావు, టీడీపీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు కృష్ణమనాయుడు, కేశవమూర్తి, రైతులు పాల్గొన్నారు.

## లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు

**నరసన్నపేట, జులై 19 (వార్త):** మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు తప్పవని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. నరసన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



### వైసీపీ నాయకులు..

# విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డారు

### టీడీపీ నేతల విమర్శలు




**మందస, జులై19 (వార్త):** వైసీపీ నాయకులు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. మందస మండలం హరిపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు భావన దుర్యోధన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. బహాడపల్లి గ్రామంలో రెండు రోజులు కిందట మందస మండల పరిషత్ అధ్యక్షుడు, వైసిపి నాయకుడు డొక్కరి దానయ్య, జోగ కృష్ణారావు ఇళ్లల్లో జరిగిన విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారన్నారు. వారు వినియోగిస్తున్న విద్యుత్ రీడింగులు పరిశీలించగా ప్రజలు విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయన్నారు బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తులు ఇలా విద్యుత్ చౌర్యానికి పాల్పడడం, సకల సౌకర్యాలు ఉన్న ఇలాంటి వారి బిల్లులు చూస్తే తక్కువ బిల్లులతో మేనేజ్ చేస్తూ వస్తున్నారన్నారు. ఈ వ్యవహారంపై అధికారులు లోతైన విచారణ జరపగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయని, సంఘటనపై మందస మండల ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచిన వైసిపి పాలకులు ఒకపక్క విద్యుత్ చార్జీలు పెంచడంతో ఆ బిల్లులు కట్టలేక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి చూశామన్నారు. వైసీపీ నాయకులు ఇలా విద్యుత్ చౌర్యానికి పాల్పడడాన్ని టీడీపీ ఖండిస్తుందన్నారు. విద్యుత్ చౌర్యం చేయడంపై వారికి సహకరించిన విద్యుత్ ఉద్యోగులతో పాటు డొక్కరి దానయ్య, జోగ కృష్ణారావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీపీ పదవికి డొక్కరి దానయ్య అనర్హుడన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు, బైరిశెట్టి గున్నయ్య, ముడిముంచి నవీన్ కుమార్,ముంజేటి చంద్రశేఖర్,సాలిన మాధవరావు, సాలిన జానకిరావు,కోట నీలకంఠం, కరగాన వల్లభరావు, సింగుపురం వెంకటరావు, శిష్టు ప్రసాద్, మడియా ధర్మారావు, మల్లేన జనార్దన పాల్గొన్నారు.

# ఫిర్యాదుదారులకు న్యాయం చేయండి

*** వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించండి * ఎస్పీ మహేశ్వర రెడ్డి * రెండో పట్టణ పీఎస్, దిశ స్టేషన్ తనిఖీ**

**శ్రీకాకుళం క్రైం, జులై 19 (వార్త):** పోలీస్ స్టేషనకు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించి వారి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి బాధితులకు న్యాయం చేయాలని నూతన ఎస్పీ కె.వి మహేశ్వర్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా ఎస్పీ శ్రీకాకుళం పట్టణంలో దిశ, రెండువ పట్టణ పోలీసు స్టేషన్‌లను ఆకస్మికంగా సందర్శించారు. స్టేషను ఆవరణాన్ని, స్టేషను గదులను పరిశీలించి, స్టేషను నిర్వహణ రికార్డులు, ముఖ్యమైన సిడి ఫైల్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టేషనులో నమోదైన మహిళపై జరిగిన దాడుల కేసులు, భార్యాభర్తల గొడవలు వంటి ముఖ్యమైన కేసులు దర్యాప్తు తీరును పరిశీలించారు. స్టేషను సిబ్బంది వివరాలు, విధి నిర్వహణలపై ఆరా తీశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రాత్రి వేళలో గస్తీ విధులు పటిష్టంగా నిర్వర్తించి నేరాలు నియంత్రణ, విజిబుల్ పోలీసింగు చేపట్టాలని తదితర అంశాలపై అధికారులను ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీసమయంలో దిశ పోలీసు స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరావు, టూ టౌన్ సిఐ ఉమా మహేశ్వర రావు, పోలీసు స్టేషను సిబ్బంది హాజరుగా ఉన్నారు.



## నదుల అనుసంధానం చేయాలని వినతి

**కంచిలి, జులై 19(వార్త):** వంశధార, నాగావళి, మహేంద్రతనయ, బహుదా నదులను అనుసంధానం చేయడం వల్ల జిల్లా రైతులకు సాగునీరు పుష్కలంగా అందుతుందని తెలుగుదేశం పార్టీ నాయకులు మాదిన రామారావు, పిలక చిన్నబాబు, సోంపేట మాజీ ఎంపీపీ శ్రీను, వంశధార జలసాధన సమితి కన్వీనర్ ప్రధాన శివాజీ కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా వర్షాలపై జిల్లాకు చెందిన రైతులు ఆధారపడి సాగు చేస్తున్నారన్నారు. అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులు నష్టాలకు గురవుతున్నారని తెలిపారు. నదులు అనుసంధానం చేస్తే జిల్లా రైతులు ఏడాదికి మూడు పంటలు వేసే పరిస్థితి ఉంటుందన్నారు.



### ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్లను

# వినియోగించుకోండి

**కొత్తూరు, జులై 19 (వార్త):** మండలంలోని మదనాపురం, బలద, నేరడి, కొత్తూరు పంచాయతీలో గల గ్రామ సచివాలయ కేంద్రాలలో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే ఆధార్ మెగా డ్రైవ్ ప్రోగ్రాంలను ఏర్పాటు చేస్తున్నామని, లబ్ధిదారులు సద్వినియోగపరచుకోవాలని ఎంపీడీవో పి.త్రివిక్రమరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 0 నుండి 5 సంవత్సరాల మధ్య చిన్నారులు, 18 సంవత్సరములు లోపు బాల బాలికలు, ప్రజలు, విద్యార్థులు ఆధార్ కార్డ్ పొందిన వారు దగ్గరలో ఉన్న సచివాలయానికి వెళ్లి ఆధార్ నమోదు, అప్డేట్ చేసుకోవాలన్నారు.



## ఎస్పీని కలిసిన తైక్వాండో శ్రీను

**శ్రీకాకుళం టౌన్, జులై 19 (వార్త):** శ్రీకాకుళం జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలను స్వీకరించిన కె.వి.మహేశ్వర రెడ్డిని అంబేద్కర్స్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా పోలీసు కార్యా లయంలో శుక్రవారం నూతన ఎస్పీని తైక్వాండో శ్రీను అంబేద్కర్ చిత్ర పటాన్ని అందజేశారు. దళితులపై దాడులను అరికట్టాలని ఎస్పీని కోరారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక






## మంత్రి అచ్చెన్నను కలిసిన కలమట

**కొత్తూరు, జులై19 (వార్త):** పాతపట్నం టీడీపీ నాయకుడు, శ్రీకాకుళం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కలమట వెంకటరమణ శుక్రవారం నిమ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట పాతపట్నం నియోజకవర్గం టీడీపా నాయకులు ఉన్నారు.

# ఖాదీ వస్త్రాలను ప్రతి ఒక్కరూ ఆదరించాలి

### ఎమ్మెల్యే గొండు శంకర్

**శ్రీకాకుళం టౌన్, జులై 19(వార్త):** ఖాదీ వస్త్రాలను ఆదరించి చేనేతకారులను అండగా నిలవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. ఇల్లిసిపురంలోని గ్రామ స్వరాజ్యసంఘం ఖాదీ ధామ్ ఆవరణలో ఆధునీకరించిన ఖాదీ గ్రామోద్యోగ్ బాండార్‌ను శుక్రవారం ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. ఈ సందర్బంగా ఖాదీ ఉత్పత్తులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆధునిక వస్త్ర ప్రపంచంతో పోటీ పడుతూ ఖాదీ పరిశ్రమ మనుగడ సాగిస్తోందన్నారు. యువత ఖాదీని ఆదరించాలని, తద్వారా చేనేతలకు అండగా నిలబడచ్చన్నారు. స్వతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర ఫోషించడంతో పాటు ప్రపంచ ప్రాఖ్యాతి గాంచిన ఖాదీ పరిశ్రమకు పూర్వవైభవం తెచ్చే దిశగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమీషన్ డైరెక్టర్ ఎస్. గ్రీప్, అసిస్టెంట్ డైరెక్టర్ షేక్ మొహమ్మద్ నాస్, గ్రామ స్వరాజ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### రిమ్స్‌కు ఎమ్మెల్యే శంకర్ వితరణ



రిమ్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా స్థానిక శాసన సభ్యుడు గొండు శంకర్ శ్రీకారం చుట్టారు. ఆసుపత్రిలో రోగుల సౌకర్యర్థం 25 ఫ్యాన్లను అందజేసేందుకు ముందుకు వచ్చారు. రాష్ట్ర వ్యవసాయ మంత్రి గురువారం నిర్వహించిన సమీక్ష సందర్భంగా రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, మౌలిక సదుపాయల కల్పనకు దాతలు, స్వచ్చంద సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే శంకర్ తనవంతు బాధ్యతగా ఫ్యాన్లను వితరణగా అందజేస్తున్నట్లు ప్రకటించారు. తన సొంత నిధుల నుంచి 25 ఫ్యాన్లను ఆసుపత్రికి అందజేస్తున్నట్లు గొండు శంకర్ తెలిపారు. అదేవిధంగా కాంట్రాక్టర్ లక్ష్మణరావు 25 ఫ్యాన్లు, రామారావు 50 ట్యూబ్ లైట్లను రిమ్స్ ఆసుపత్రికి అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే శంకర్ వివరించారు.




## ఆచార్య జ్యుయెలరీ షాప్‌లో చోరీ

### * మందసలో వరుస చోరీలతో భయాందోళనలో వ్యాపారులు * పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



**మందస, జులై19(వార్త):** మందసలో జరుగుతున్న వరుస దొంగతనాలతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మందస మార్కెట్ జంక్షన్లో గల ఆచార్య జ్యుయెలరీ షాపులో అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగింది. షాపు తెరిచి దొంగలు చోరీకు పాల్పడ్డారు. షాపులో పూజకు ఉపయోగించే వెండి విగ్రహాలు, ముక్కు పుడకలు, పలు రకాల వెండి వస్తువులు మొత్తం కలిపి సుమారు రు.60,000 విలువ చేసే వెండి ఆభరణాలు చోరీ కాబడ్డాయి. అదేవిధంగా మూడు సీసీ కెమెరాలను కూడా అగంతకులు ఎత్తుకు వెళ్లారు. దీంతో వ్యాపారస్తులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. మందస పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరిస్తున్నారు. వరుస దొంగతనాలు చోటు చేసుకోవడంతో మందస వ్యాపారస్తుల సంఘం మందస మార్కెట్ జంక్షన్ నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మందస ఎస్ఐ బి.అనిల్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారస్తులు మాట్లాడుతూ ఇటీవల మార్కెట్లో రెండు కిరాణా షాపులు, మెడికల్ షాపులు దొంగతనానికి గురయ్యాయని తెలిపారు. మళ్ళీ ఆచార్య జ్యుయెలరీ షాపులో దొంగతనం జరగడంతో భయభ్రాంతులకు గురవుతున్నామన్నారు. దొంగతనాల నివారణకు చర్యలు తీసుకొని వ్యాపారస్తులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిల్లం శెట్టి నరేష్, బరాటం జయప్రకాష్, వడ్డి గోపాలకృష్ణ, కిల్లం శెట్టి సత్యం, బత్తుల ఈశ్వరరావు, వ్యాపారులు ఉన్నారు.




## 456వ రోజుకు అన్నా క్యాంటీన్

**శ్రీకాకుళం టౌన్, జులై 19(వార్త):** పేదల ఆకలి తీర్చడం కోసం టీడీపీ హయాంలో గొండు శంకర్ ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ శుక్రవారం నాటికి 456వ రోజుకు చేరింది. శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి, పాత బస్టాండ్ ప్రాంతాల్లో నిరంతరాయంగా, మండే ఎండల్లోను, జోరు వానలోనూ అన్నా క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. రుచికరమైన, నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

**హిరమండలం, జులై 19(వార్త):** పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం పొందవచ్చని పంచాయతీ అధికారి వి.శ్రీరామచంద్రమూర్తి సూచించారు. శుక్రవారం హిరమండలం మేజర్ పంచాయతీ పరిధిలో జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు ఫ్రైడే - డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. మురికి కాలువల్లో ఉండే చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ఆవరణలో నిల్వ నీటిని తొలగించాలని, ప్రభుత్వం అందజేసిన డస్ట్‌బిన్స్ వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట జూనియర్ సహాయకులు ఎ.నర్సింగరావు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు

## గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు

**హిరమండలం, జులై 19(వార్త):** గురుపౌర్ణమి వేడుకలను మండలంలో న్యూబేరేజ్ సెంటర్ షిర్డి సాయి ఆలయంతో పాటు పెద్దకోరాడ వీధిలో ఉన్న స్వయంభూ సద్గురు షిరిడి సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలకు ఈ నెల 21న నిర్వహించేందుకు ఆలయ కమిటి నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం షిర్డిసాయి ఆలయ అర్చకులు పొందూరి గౌరి రామకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ గురుపౌర్ణమి వేడుకలు పురస్కరించుకుని కాకడ హారతి, సుప్రభాత సేవ, నిత్యార్చన, పంచామృత, పండ్ల రసాలతో అభిషేకాలతో పాటు పలు అభిషేకాలు, అన్న ప్రసాద వితరణ తదితర వంటి కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. గురుపౌర్ణమి వేడుకల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## మెలకువలతోనే వరిలో అధిక దిగుబడులు

**హిరమండలం, జులై 19(వార్త):**:రైతులు మెలకువలు పాటించినట్లయితే అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడుతుందని అదనపు డిపిఎం ధనుంజయరావు సూచించారు.శుక్రవారం మండల కేంద్రం వెలుగు కార్యాలయంలో డివిజన్ పరిధిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వరికి వచ్చే వ్యాధులను నివారించేందుకు, మొక్క ఎదుగుదలకు సంబంధించిన సేంద్రీయ ద్రావణాలు ఉపయోగించాలని సూచించారు. గిరిజన రైతులు పండిస్తున్న చిరుధాన్యాల పంటలు, ప్రాముఖ్యత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది గోవిందరెడ్డి, శివాజి, ముసలయ్య, ఎంటీలు సూర్యనారాయణ, చిన్నమ్మడు, ఐదు మండలాలకు చెందిన యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.



## డాక్టరేట్‌తో మరింత బాధ్యత

**హిరమండలం, జులై 19(వార్త):** డాక్టరేట్ మరింత బాధ్యత పెంచుతోందని హెల్పింగ్ హేండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోతురాజు శ్రీధర్ అన్నారు. శుక్రవారం హెల్పింగ్ హేండ్స్ డాక్టరేట్ అందుకుని మండలానికి వచ్చిన శ్రీధర్‌కు స్వచ్చంద సేవా సంస్థ సభ్యులు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అలికాం - బత్తిలి ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టరేట్ అందుకున్న శ్రీధర్‌కు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ హెల్పింగ్ హేండ్స్ స్వచ్చంద సేవా సంస్థ ద్వారా సమాజంలో అనేక సేవలు అందజేయటం వలన డాక్టరేట్ వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంజిఆర్ యువసేన సభ్యులు, అభిమానులు, హెల్పింగ్ హేండ్స్ సేవ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## కుటుంబ నియంత్రణ అందరి బాధ్యత



**హిరమండలం, జులై 19(వార్త):** కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స అందరి బాధ్యతని వైద్యాధికారులు సిహెచ్ సాయిగీత, ఫరూఖ్ హుస్సేన్‌లు సూచించారు. శుక్రవారం హిరమండలం పిహెచ్‌సిలో 8 మందికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ బాలింత ఇద్దరు పిల్లలు సంతానం తరువాత ఖచ్చితంగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేసుకోవాలన్నారు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించుకోకపోవటం వలన ఎక్కువగా గర్భం దాల్చవటం వలన మాతృ మరణాలు సంభవించే అవకాశం ఉందన్నారు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకోవాల్సిన వారు తొలుతగా ప్రాధమిక ఆరోగ్య కేంద్రానికి పేరు నమోదు చేసుకోవాలని వారు సూచించారు. ముఖ్యంగా ఆడవారి కన్నా మగవారు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స నిర్వహించుకుంటే చాలా మంచిదని, ఒకే ఒక కుట్టుతో కు.నిలు చేయవచ్చని, శస్త్ర చికిత్స అనంతరం మరుసటి రోజు నుంచే పనులు చేసుకోవచ్చని వారు సూచించారు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించుకున్న వారికి ప్రభుత్వం మహిళలకు రూ.600లు, మగవారికి అయితే రూ.1100 ప్రోత్సహాకం ఇస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలతో పాటు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు

## శాంతినగర్‌లో పారిశుధ్య పనులు

**శ్రీకాకుళం టౌన్, జులై 19(వార్త):**శ్రీకాకుళం నగరంలోని శాంతి నగర్ కాలనీలోని ఏడో డివిజన్ స్విమ్మింగ్ ఫూల్ దగ్గర శుక్రవారం డ్రై డే నిర్వహించారు. కాలువల్లో చెత్తా చెదారాలను తొలగించి శుభ్రం చేసి దోమల నివారణకు చర్యలు చేపట్టారు.

## లారీని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు




**శ్రీకాకుళం క్రైం, జులై 19 (వార్త):** లావేరు మండలం అదపాక జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఆగివున్న లారీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు శుక్రవారం ఢీకొంది. ఛత్తీస్‌గడ్ వైపు వెళుతున్న లారీ మరమ్మతులకు గురికావడంతో అదపాక జంక్షన్ వద్ద రోడ్డు పక్కన నిలిపి డ్రైవర్, క్లీనర్ మరమ్మతులు చేస్తున్నారు. విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సు అదపాక జంక్షన్ వద్ద నిలిపివున్న లారీని వెనుక నుంచి ఢీకొంది. దీంతో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. బస్సు డ్రైవర్‌తో పాటు లారీ క్లీనర్, ప్రయాణికులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న లావేరు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వర్షం కురుస్తుండడంతో ముందుగా ఉన్న లారీ కనబడకపోవడంతో బస్సు ఢీకొనివుంటుందని పలువురు చెబుతున్నారు.




Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



## శ్రీకాకుళం

బాబాయ్, అబ్బాయ్‌లకు టెక్కలిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం పౌర సన్మానం చేశారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత టెక్కలి వచ్చిన సందర్భంగా పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు వారికి అపూర్వ స్వాగతం పలికారు. టెక్కలి ఏ మూల చేసినా టీడీపీ జెండాలు రెపరెపలాడాయి. జై కింజరాపు నినాదాలతో టెక్కలి మార్మోగింది.

- (వార్త - టెక్కలి)

# బాబాయ్, అబ్బాయ్‌కి..
# అపూర్వ స్వాగతం







